www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 27 సెప్టెంబర్ 2025

5

వైఎస్ఆర్

చికిత్స కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప : పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించి పిల్లల తల్లిదండ్రులు జిల్లా సత్వర చికిత్స కేంద్రం, జిల్లా బాల భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది శాంత అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు శుక్రవారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే రిమ్స్ ఆవరణలోని కడప రిమ్స్ ఆవరణలో ఉన్న జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో మరియు రిమ్స్ ఆవరణలో గల 'మానసిక ఆరోగ్య సంస్థ' లో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన పిల్లల తల్లిదండ్రులు ఇలాంటి చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను

రెగ్యులర్ చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం 2022 పిఆర్ సి అరియర్స్ ఇవ్వాలని, యు ఇజయు, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కె.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కమ్ అధ్యక్షులు ఎన్.శివశంకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయలు ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలని పేర్కొన్నారు. 20, 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను అందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్సి అరియర్స్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని తెలిపారు. కొత్త ఆపరేటర్లందరికీ పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికీ స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని తెలిపారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్‌వాచ్ వినియోగించాలని చెప్పారు. కార్మికులకు అనారోగ్యం పాలైన, ప్రమాదానికి గురైన ఉచితంగా అన్లిమిటెడ్ హెల్త్ కార్డులను కార్మికులకు ఇవ్వాలని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల ఇవ్వాలని, కొత్త ఆపరేటర్లకు ఫీల్డ్ అసిస్టెంట్లకు అందరికీ పాత ఆపరేటర్ తో సమానంగా జీతాలు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ లందరికీ పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని కోరారు. అనేకసార్లు ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో అక్టోబర్ 5న విజయవాడ కేంద్రంగా అన్ని కాంట్రాక్టు రెగ్యులర్ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 10న ఏపిఎస్‌పిడిసిఎల్ తిరుపతి కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, ఎస్ఎఫ్ఐ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, మైదుకూరు డివిజన్ కార్యదర్శి పి. సి.కొండయ్య, పులివెందుల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున రెడ్డి, చంద్రమౌళి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శివప్రసాద్ రెడ్డి, గోపి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్,రవి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు జి.రాజామణి, డివై ఎఫ్ ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రామ్,జిల్లా నాయకులు మధుసూదన నాయుడు, సాయి సుబ్బరాయుడు, విద్యుత్ కార్మికులు అహ్మద్ బాషా, గౌస్ బాషా, అశోక్ రమేష్ బాబు పాల్గొన్నారు.

పాలకులు మారుతున్నా.. ప్రాజెక్టుల పురోగతి లేదు

- గాలేరు - నగరి ప్రాజెక్టుకు నిధుల కేటాయించి పూర్తి చేయండి

- గుర్రంగుంపు స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

గుర్రంగుంపు స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

కడప జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గాలేరు-నగరి ప్రాజెక్టుకు అంతర్భాగంగా ఉన్న గుర్రం గుంపు స్టాక్ పాయింట్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలో ఉన్న గుర్రం గుంపు స్టాక్ పాయింట్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవికతను అధ్యయనం చేసి నిజాలు నిగ్గుతేల్చి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు క్షేత్రస్థాయి పర్యటన చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుల కన్న ముందు దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న గాలేరు - నగరి ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని తెలిపారు. పదవి కాంక్ష తప్ప ప్రాంతాల అభివృద్ధి కోసం ఈ ప్రాంత రాజకీయ నేతలు నోరు మెదడుపడం లేదన్నారు. ప్రాజెక్టులో పూర్తి చేయడంలో పాలకులు వైఫల్యం చెందారని పేర్కొన్నారు. మండలంలో ఉన్న గుర్రం గుంపు స్టాక్ పాయింట్‌ను పూర్తిచేస్తే ఈ ప్రాంతంలో అన్ని చెరువులకు సాగు, తాగునీటి సమస్య పరిష్కరించుకోవచ్చని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టు నిధుల కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో దశలవారి ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపాలకృష్ణయ్య దస్తగిరి రెడ్డి రైతు సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి చిన్న సిద్దయ్య రహీం, అనిపి రెడ్డితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి 'సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్'పై నెల రోజుల పాటు నిర్వహించాల్సిన సెలబ్రేషన్స్, సీజనల్ కండిషన్స్, పిఎం కుసుమ్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్, విండ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితోపాటు జెసి అదితి సింగ్,డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, డిఎస్‌టి డిప్యూటీ కమిషనర్, జిల్లా సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ నోడల్ అధికారి జి. సుమతి, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, మెప్మా పీడి కిరణ్ కుమార్ హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మారిన ధరల విషయంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. 4 వారాల షెడ్యూల్‌ను సవివరంగా ప్రజలకు వివరించాలని చెప్పారు.. ఇంటింటికి వెళ్లి జిఎస్‌టి తగ్గింపు, సేవింగ్స్ గురించి వివరించాలన్నారు. జిల్లా స్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

టూరిజం సర్క్యూట్‌తో అభివృద్ధి అవకాశాలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : టూరిజం సర్క్యూట్‌తో అభివృద్ధి అవకాశాలు ఉన్నాయని కడప చాప్టర్ కన్వీనర్, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ సభ్యులు లయన్ చిన్నపరెడ్డి అన్నారు. శుక్రవారం ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినం సందర్భంగా ముందస్తుగా స్థానిక నగరవనంలో కడప ఇంటాక్ చాప్టర్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటాక్ సమావేశం, హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ కడపలో అనేక కళాత్మక సాంస్కృతిక చారిత్రక దర్శనీయ ప్రదేశాలన్నింటినీ కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసి, పర్యాటక రంగం అభివృద్ధి చర్యలు తీసుకోవాలని అన్నారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా రవాణా, ఆతిథ్యం, గైడ్‌ఉపాధి అవకాశాలు పెంపొంది, జాతీయ స్థూల ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. నగరవనం ఫారెస్ట్ రేంజర్ ప్రసాద్, డెప్యూటీ రేంజర్ మల్లికదేవి, టూరిజం కమిటీ సభ్యుడు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, ఇతర సభ్యులు కలసి మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రంగనాధరెడ్డి ,సెక్రటరీ గునిశెట్టి సాయి, జోన్ ఛైర్మన్ వెంకటసుబ్బయ్య, సెకాలజిస్ట్ ఓవీరెడ్డి, రిసోర్స్ పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు, వైవీయూ రామసుబ్బారెడ్డి, రాయలసీమ టూరిజం సొసైటీ కార్యదర్శి జనార్ధనరాజు, రోటేరియన్ తాజుద్దీన్, గౌరిశంకర్, నాగమునిరెడ్డి, శివశంకర్ రెడ్డి, కళావతి పాల్గొన్నారు.

నృత్య, సంగీత కోర్సులలో ప్రవేశాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వ విద్యాలయంలోని లలిత కళల శాఖ ఆధ్వర్యంలో కూచిపూడి, కర్నాటక సంగీతం, కీబోర్డు, సర్టిఫికెట్ కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలను ఈ నెల 29 నుంచి ప్రారంభించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ టి. లక్ష్మీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ అక్టోబర్ 18 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. పదేళ్ళ వయసు నిండిన వారి నుంచి తర్వాత ఏ వయసు వారైనా ఈ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. వివరాలకు www. edu.in, లేదా 903259510లో సంప్రదించాలన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

మండలిలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి

ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామ చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా 143 హామీలతో కూటమి ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఐఆర్ లేదని తెలిపారు. డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ సక్రమంగా అమలుకాకుండా నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచమంటూనే రూ.15, 485 కోట్లు పెంచారని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 95 శాతం హామీల అమలు చేశారని గుర్తు చేశారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతూ ఉంటే అందరికీ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కొంతమందికి రాలేదని, వచ్చినవారికి తక్కువ మొత్తంలో నగదు జమైందని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ మొదటి ఏడాది వెయ్యలేదని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో రైతులకు గిట్టుబాటు ధరలు దక్కేవని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఒపిఎస్ కోరుకుంటున్నారని చెప్పారు. ఉద్యోగులకు రూ.30 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు రోడ్లపై కనబడుతున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ సరిగా అమలు కావడంలేదని చెప్పారు. మెడికల్ కళాశాలలు ప్రయివేట్ పరం చేయడం సమంజసం కాదన్నారు. మరిన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : గర్భిణులు పోషక ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిఎఒ వాణి, అసిస్టెంట్ సిడిపిఒ శోభారాణి అన్నారు. శుక్రవారం నగరంలోని నకాష్ సెక్టార్ ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లో రాష్ట్రీయ పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు స్థూలకాయ నివారణ పోషణ అభి, పడాయి బి, శిశు రక్షణ, గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనతకు గురి కాకుండా తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ రెడ్డి, సూపర్‌వైజర్లు, నాయకులు అంజనీదేవి, సల్మా పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న సిడిపిఒ వాణి

వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

దసరా పండుగ సీజన్‌ను ఆసరాగా చేసుకుని ప్రజల వద్ద నుంచి అధిక టికెట్ రేట్లు పెంచి వసూలు చేస్తున్న ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. శుక్రవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో కార్యాలయ పరిపాలన అధికారి ప్రకాష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రయివేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు సాధారణ రోజులలో ఒక ధర, పండుగ సీజన్‌లలో ఒక ధర వసూలు చేస్తున్నారని విమర్శించారు. రూ.2 వేల నుంచి రూ.5వేల వరకు టికెట్ ధరలు పెడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడకు ప్రజలు ఎక్కువ ప్రయాణాలు సాగిస్తుంటారని తెలిపారు. ఈ పండుగ పూట సాధారణ, మధ్యతరగతి కుటుంబం బస్సు ప్రయాణం చేయాలంటే వేల రూపాయలు చెల్లించి సొంత ఊర్లకు రావాల్సి వస్తుందని అన్నారు. బహిరంగంగా ప్రయివేటు ట్రావెల్స్ ఆన్‌లైన్‌లో డబ్బులు ఎక్కువ చూపెట్టి వసూలు చేస్తున్నా రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సుదూర ప్రాంతాలకు బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండాలని కానీ సింగిల్ డ్రైవర్ నే సర్వీసు రూటుకు పంపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పేర్కొన్నారు. గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. రవాణా శాఖ అధికారులు రెగ్యులర్ తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పండుగ సీజన్‌లో అధిక టికెట్ రేట్లు పెంచి వసూలు చేస్తున్న ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటి పై తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు, జిల్లా నాయకులు సునీల్ పాల్గొన్నారు.

రేపు 'సూక్తి సుధా లహరి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -కడప అర్బన్

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు కీ.శే. డి. ఇమామ్ సాహేబ్ రచించిన 'సూక్తి సుధా లహరి' అనే గ్రంథాన్ని కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆవిష్కరిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇమామ్ సాహేబ్ కుమారులు డి. రమేష్ బాబు, రవికుమార్, కుమార్తె పద్మజ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు, విశిష్ట అతిథిగా ప్రసిద్ధ సైకాలజిస్ట్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, పుస్తక సమీక్షకులుగా ప్రముఖ సాహితీవేత్త, వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, ఆత్మీయ అతిథులుగా మొల్ల సాహిత్య పీఠం వ్యవస్థాపకులు, డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల రిటైర్డ్ జువాలజీ అధ్యాపకులు డాక్టర్ ఎం.సి.వెంకట సుబ్బయ్య, విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె. వెంకటసుబ్బయ్య, కడప జిల్లా రిటైర్డ్ స్టెప్ సిఇఒ డాక్టర్ మలిరెడ్డి రామచంద్రారెడ్డి, సభ నిర్వాహకులుగా రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి భూమి రెడ్డి స్వరూపారాణి హాజరవుతారని పేర్కొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే సమస్యలు

ప్రజాశక్తి - బద్వేలు

పాలకుల నిర్లక్ష్యంగా కారణంగానే బద్వేల్ నియోజకవరగంలో సమస్యలు తిష్టవేశాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్, బద్వేల్ టౌన్ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం బద్వేల్ టౌన్ సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేల్ నియోజక వర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని పాలకుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు అలాగే ఉన్నాయని వారుతె లిపారు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు, ఇంటి పట్టాలు, ఎన్ఒసి సర్టిఫికెట్లు, మున్సిపాలిటీ , నియోజకవర్గ అభివృద్ధి, బ్రహ్మ సాగర్ పిల్ల కాలువలు, తాగునీరు, డ్రెయినేజీ, పేదల కాలనీలో మౌలిక సదుపాయాలు ప్రజల సమస్యల మీద నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాబోవు రోజుల్లో పోరాటాలను మరింత విస్తృతం చేయడానికి పార్టీ కార్యకర్తలను సైదాంతి కంగా సన్నద్ధం చేయడం కోసమే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించే తరగతులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి వి, వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ సభ్యులు, దడాల సుబ్బారావు జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ హాజరుకానున్నారని తెలిపారు. తరగతులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనంలో నిర్వహించనున్నామని చెప్పారు. సమావేశంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, పార్టీ సభ్యులు వెంకటేశ్వర్లు, రామయ్య పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి మేయర్‌గా

ముంతాజ్‌బేగం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

బాధ్యతలు స్వీకరిస్తున్న ముంతాజ్‌బేగం

ఇన్ ఛార్జి మేయర్‌గా ముంతాజ్ బేగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి తీసుకు వచ్చిన మేయర్ పదవి పత్రాలపై ఆమె సంతకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ ఛాంబర్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ మేయర్ పదవి రావడం సంతోషంగా ఉందని, మరోపక్క మేయర్ సురేష్ బాబును అవినీతి ఆరోపణలతో ప్రభుత్వం పదవి నుంచి తొలగించడం బాధగా ఉందని తెలిపారు. డిప్యూటీ మేరుగా ఉన్న తనను ప్రభుత్వం ఇన్‌ఛార్జిగా మేయర్ నియమించడం మరింత బాధ్యతను పెంచినట్లు అయిందన్నారు. ముందుగా ఆమె స్వగృహమైన రవీంద్ర నగర్ నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మేయర్ ఛాంబర్‌లో ఇన్‌ఛార్జి మేయర్‌గా ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పదవి ఇచ్చిన ప్రభుత్వానికి, సహకరించిన జగన్మోహన్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, మాజీ మేయర్ సురేష్ బాబు కు కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర నగర్ అభివృద్ధి చేశామని, ఇప్పుడు నగరమంతా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నగరంలో పర్యటించిన కమిషనర్

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా వెస్ట్, నార్త్ జోన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెస్ట్ జోన్‌లో 50 డివిజన్‌లోని రుకవారిపల్లిను సందర్శించారు. ఇక్కడి ప్రజలతో మమేకమై చెత్తని రోజూ ప్రతీ ఇంటి నుంచి తొలిగిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ సమస్యల గురించి అడిగి తెలుసు కున్నారు. సిటీ చుట్టూ ఉన్న ప్రతీ విలేజ్‌ను సందర్శించి ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. రోడ్ మీద, ఖాళీ స్థలంలో గాని నీళ్లు నిలవకుండా చూసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారిగా, ఎస్ఇకి ఆదేశారు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ చెత్తను బయట ఎక్కడ వేయకుండా క్లాప్ వెహికల్‌లో మాత్రమే వెయ్యాలని పేర్కొన్నారు. ప్రజల సహకారం ఎంతో అవసరమని చెప్పారు.

7న చలో కార్పొరేషన్

ప్రజాశక్తి - కడప అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఈనెల 27న చలో కడప కార్పొరేషన్ నిర్వహిస్తున్నట్లు ఎపిమున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి తెలిపారు. శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల స్థానిక సమస్యలపై రెండవ రోజు పాదయాత్ర మాసాపేట, శంకరాపురంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ, మరుగుదొడ్లు, సిసి రోడ్లు, ఇళ్లులేనివారికి ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, నగర కమిటీ సభ్యులు పాలపర్తి నాగరాజ్, రోడ్డ శివకుమార్, వర్మి కంపోస్ట్ నిత్య, హరికృష్ణ, రాజు, పెంచలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజి, పుష్పగిరి విట్రో రెటీనా హాస్పిటల్ (పుష్పగిరి ఐ హాస్పిటల్) సంయుక్తంగా వైద్య ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం కెఎస్ఆర్ఎం కళాశాల అవరణలో వారి విద్యా సంస్థలో పనిచేస్తున్న వారందరికీ ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థలో ఉద్యోగుల ఆరోగ్యంతో పాటు వారి బాధ్యత కూడా తమ మీద ఉందని పేర్కొన్నారు. వారి సంక్షేమాన్ని చూసుకోవడం సంస్థ బాధ్యత అని తెలిపారు. కంటి శిబిరం లో 300 మంది హాజరయ్యారు. దాదాపు 120 మందికి అద్దాలు, చుక్కల మందు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.ఎన్. ప్రసాద్, డాక్టర్ వినోద్ కుమార్, ఆప్తమిస్ట్రిస్ట్, డీ.రాజ శేఖర్ క్యాంప్ కో-ఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్స్, వాలంటీర్స్ పాల్గొన్నారు.

ధైర్యానికి మారుపేరు ఐలమ్మ

ప్రజాశక్తి - కడప : కడప నగరంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి కోరారు. శుక్రవారం కడప నగరంలోని జిల్లా రజక సంఘం జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘం ఆదేశాల మేరకు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి మాట్లాడుతూ అన్ని మతాలకు చెందిన మహిళలకు స్ఫూర్తిగా ,ధైర్యానికి మారుపేరుగా చాకలి ఐలమ్మ చూపించిన చొరవ అందరికి ఆదర్శంకావాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం కార్యదర్శి మత్చయ్యగారి మల్లయ్య, రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎం.మల్లయ్య, జిల్లా రజక నాయకులు ఎరికలయ్య, వెంకట్రావు, కృష్ణ, చెన్నప్ప, జి. కృష్ణయ్య, చంద్ర, చిన్న గంగన్న, హరి, బైరేస్ పాల్గొన్నారు. **బద్వేలు :** పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో మహనీయుల ఆశయాల సాధన సమితి ఆధ్వర్యాన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 130 జయంతి వేడుక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు, ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త, పట్టణ అభివృద్ధి సొసైటీ ఉపాధ్యక్షులు గనుమంతు రాజేష్ కుమార్ పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దొరల, రజాకార్ల అరాచక పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన ఐలమ్మ రజక కులంలో పుట్టడం రజకులందరికీ గర్వకారణం అన్నారు. నిర్వాహకులు మహనీయుల ఆశయాల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గురుమూర్తి మాట్లాడుతూ ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని రజకులందరూ ఐకమత్యంగా న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వృత్తి కారుల అధ్యక్షులు నాగార్జున,దళిత హక్కుల పోరాట సమితి నాయకులు పడిగె వెంకటరమణ,రిటైర్డ్ లెక్చరర్ లక్ష్మీనరసయ్య ప్రసంగించారు. రిటైర్డ్ ఎఎస్ఐ బాలగురన్న, కొరిగం రమణయ్య, వడ్డమాను వెంకటరమణ, నవీన్,కృష్ణయ్య, మనోజ్,రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, సుబ్బయ్య, లక్ష్మయ్య,బద్వేలు కలసపాడు, గోపవరం, బి.కోడూరు, పోరుమామిళ్ల, అట్లూరు మండలాల రజక నాయకులు పాల్గొన్నారు.

ఎంఎస్‌సి కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్‌సి ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లయిడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు టి.లక్ష్మీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలున్నాయని పేర్కొన్నారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపిసి, బైపిసిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోని ఎపి మైన్స్ అండ్ జియాలజీశాఖలో టెక్నికల్ అసిస్టెంట్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చని పేర్కొన్నారు. ఎపిఎస్ఆర్ఎసి, ఎపి ఎస్ఎండిసి, ఎపి గ్రౌండ్ వాటర్ బోర్డ్ వంటి సంస్థలలో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో సెంట్రల్ గవర్నమెంట్ ఒఎన్‌జిసి, జిఎఐఎల్, సెయిల్, కోల్ ఇండియా లిమిటెడ్, బిపిఎల్, ఇస్రో సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 8985597928, 9985442196 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

కూటమి పాలనలో రైతు దగా : డిసిసి

ప్రజాశక్తి - కడప : టిడిపి కూటమి ప్రభుత్వం పగబట్టడంతో రైతన్న దగా పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి అన్నారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి రైతన్న కష్టాలు కనబడడం లేదు' అని పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల నేతృత్వంలో శుక్రవారం విజయవాడ పార్టీ ఆఫీస్ దగ్గర నుండి ర్యాలీగా బయలుదేరి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులుఉ ఎన్.డి విజయ జ్యోతి పాల్గొని ర్యాలీలో నినాదాలు చేస్తూ ప్రతి రైతు కళ్ళల్లో ఆనందం చూడాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

పోలీసు కానిస్టేబుల్ శిక్షణకు సన్నాహాలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఇటీవల ఎంపికైన స్టయిఫండరి కేడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్‌సిటిపిసి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డిటిసి) శుక్రవారం ఎస్‌పిషెల్కే నచికేత్ విశ్వనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, తరగతి గదులను, కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను, బాటిల్ అబ్బాకల్స్‌ను పరిశీలించారు. అనంతరం డిటిసి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన వెంట ఎఎస్‌పి (పరిపాలన) కె.ప్రకాష్ బాబు, డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం, సిబ్బంది ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : 'పుట్టా'

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యా సంస్థల సమస్యల పట్ల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అసెంబ్లీలో తన గళాన్ని వినిపించారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'పుట్టా'

మైదుకూరులో పాలిటెక్నిక్ కళాశాల ఉందని, పూర్తి స్థాయిలో అధ్యాపకులు, సిబ్బంది, వసతి లేదన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో 540 మంది విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ 120 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారని తెలిపారు. కళాశాలకు సొంత భవనం లేకపోవడం, అధ్యాపకుల కొరత ఇందుకు ప్రధాన కారణమన్నారు. సొంతభవనం నిర్మించి, అధ్యాపకులను ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మంగారిమఠం మండలంలో నవోదయ స్కూల్ మంజూరైందన్నారు. ఈ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ సమస్యలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన మంత్రి వెంటనే నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

మొక్కలు నాటుతున్న జోగిరెడ్డి, అధికారులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం తప్పనిసరి అని తుంగభద్ర ప్రాజెక్ట్ హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. శుక్రవారం సింహాద్రిపురం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇల్లు ఒక మొక్క నాటితే ఆ గ్రామం పచ్చదనంతో నిండిపోతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. పచ్చదనం పెరగడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి, తహశీల్దార్ సాయినాథ్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఉపాధి హామీ ఈసీ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శిల్పారామం ఎఒ విశ్వనాథ్‌రెడ్డి

రేపటి నుంచి శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విజయదశమి వేడుకల్లో భాగంగా పులివెందల శిల్పారామంలో ఈ నెల 28 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ప్రత్యేకాధికారి విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక శిల్పారామంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. 28న ఆదివారం ఎస్‌కే ఫిలిమ్స్ డాన్స్ స్టూడియో, మాస్టర్ భరత్, నంద పులివెందుల చిన్నారులతో సినీ, జానపద నృత్యాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2న గురువారం విద్యా దీపం మూవీ అలాగే ఎస్కే మాస్టర్స్, వీడియన్ డ్యాన్స్ స్టూడియో మాస్టర్ వినోద్ ధర్మవరం చిన్నారులతో జానపద, సినీ నృత్యాల ప్రదర్శన ఉంటుందన్నారు. అక్టోబర్ 5న ఎస్.విజయశాంతి సీఎం అవార్డు గ్రహీత, కూచిపూడి గిన్నీస్ వరల్డ్ రికార్డు ఓడర్ ముద్ర డాన్స్ స్కూల్ చిన్నారులు నృత్యాలు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

నిధులు తెప్పించేందుకు కృషి చేస్తా

ప్రజాశక్తి- ఖాజీపేట

రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి నిధుల కోసం కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ లక్ష్మిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెముళ్లపల్లెలో అసంపూర్తిగా ఉన్న డిజిటల్ గ్రంథాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ.. డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించేలా చూస్తామన్నారు. గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేకదృష్టి పెట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్యం వెంకట్రామిరెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ రెడ్యం రవీంద్రారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ వాకమల్లు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

బడుగు బలహీన వర్గాల అందరికి విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు ప్రసాదరావు, సుగూరు రఘునాథ్ రావు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. పేద ప్రజలకు త్వరితగతిన వైద్యం అందేలా చూడాలన్నారు. పిపిపిని రాజకీయం చేయడం శోచనీయమన్నారు. పేదలకు వైద్య సేవలు అందించేందుకు పిపిపి విధానం మేలని ప్రభుత్వం భావించి చర్యలు తీసుకుందన్నారు. గత ప్రభుత్వం 15 మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో నివాళులర్పిస్తున్న ఆర్మీ సిబ్బంది (ఇన్‌సెట్)లక్ష్మిరెడ్డి (ఫైల్‌ఫోటో)

విద్యుత్ షాక్‌తో రిటైర్డ్ మిలటరీ అధికారి మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చెంచుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ మిలటరీ అధికారి మూల లక్ష్మిరెడ్డి(55) విద్యుత్ షాక్‌తో గురువారం రాత్రి మృతి చెందారు. బంధువులు అందించిన వివరాలు ప్రకారం.. ఆర్మీలో వివిధ కేడర్లలో పనిచేసిన లక్ష్మిరెడ్డి మూడేళ్ల క్రితం రిటైర్ అయ్యారు. ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్నారు. ఇంటి వద్ద కుళాయి మోటార్‌కు మరమ్మతులు చేపడుతూ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. సమాచారాన్ని అన్నమయ్య జిల్లా కలికిరి వద్ద ఉన్న రిటైర్డ్ ఆర్మీ సిబ్బందికి బంధువులు తెలిపారు. శుక్రవారం చెంచుపల్లి గ్రామానికి ఆర్మీ అధికారులు వచ్చి రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు ప్రభుత్వ లాంఛనాల ప్రకారం నివాళులర్పించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా, ఒక కుమారుడు ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్నాడు. గ్రామంలో విషాదఛాయలు అనుముకున్నాయి.

చివరి ప్రయాణానికి చేయూత

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు : మనిషి చివరి ప్రయాణానికి మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ సంస్థ శుక్రవారం చేయూతనిచ్చింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వెంకటయ్య (75) మరణించగా, అంత్యక్రియలకు ఆయన బంధువులు మూడు రోజులుగా రాలేదు. విషయాన్ని ఫౌండేషన్ సభ్యులకు తెలపగా సిబ్బంది స్పందించి హిందూ శ్మశాన వాటికలో అంతిమ సంస్కరణలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోర్ లక్ష్మణరావు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మునీంద్ర, ఈశ్వర్, వర్ధన్‌రెడ్డి, కృప, అగ్నిసారం, ట్రస్ట్ సభ్యులు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

5జి నెట్‌వర్క్‌తో రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ఈ పోస్ యంత్రాల ద్వారా స్మార్ట్ కార్డులను వినియోగించనుంది. గతంలో రేషన్ దుకాణంలో బయోమెట్రిక్ ఆధారంగా రేషన్ సరుకులను పంపిణీ చేసేవారు. ఈ మిషన్ సిగ్నల్స్ లేకపోవడం, సరిగా పనిచేయకపోవడంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి వెనక్కి రావాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులతో ఆ సమస్యలకు చెక్ పడనుంది. మండల వ్యాప్తంగా 32 రేషన్ దుకాణాల పరిధిలో 9,281 మంది రేషన్ కార్డుదారులున్నారు. వీరికి ఇప్పటికే గ్రామాలలో చాలావరకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న స్మార్ట్ కార్డులు, నూతనంగా వచ్చిన స్మార్ట్ ఈ పోస్ మిషన్

5జి టెక్నాలజీ నెట్‌వర్క్..

గతంలో నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో గంటల కొద్దీ క్యూలైన్‌లో లబ్ధిదారులు వేచి చూసేవారు. కొన్ని గ్రామాలలో సిగ్నల్స్ సమస్య కారణంగా రాత్రుళ్లు సైతం దుకాణాల వద్దకు వెళ్లి రేషన్ తీసుకునే పరిస్థితి ఉండేది. తాజాగా స్మార్ట్ ఈ పోస్ యంత్రాలు 5జి టెక్నాలజీతో పని చేయనున్నాయి. వీటితో నెట్‌వర్క్ సమస్యలు ఉత్పన్నం కావు. వేగంగా పని జరుగుతుంది. ఈ యంత్రాలు సిమ్, వైఫై, బ్లూటూత్ వంటి వాటిని వినియోగించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పని చేయనున్నాయి. రేషన్ డీలర్లకు పంపిణీ ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

స్వైపింగ్ ద్వారా పంపిణీ..

గతంలో వేలిముద్రలు పడకపోతే కార్డుదారులు ఇబ్బందులు పడేవారు. కొత్తగా అందజేసిన స్మార్ట్‌కార్డులు క్యూఆర్ కోడ్‌తో ఉన్నాయి. స్వైపింగ్‌తో వేలిముద్రల నమోదు ప్రక్రియ సులభతరం కానుంది. వేలిముద్రలు పడనివారు ఐరిస్ ద్వారా సరుకులు ఇచ్చే వెసులుబాటూ ఉంది.

స్మార్ట్ కార్డులతోనే రేషన్..

ఇక నుంచి రేషన్ సరుకులను స్మార్ట్ ఈ పోస్ యంత్రంతో స్మార్ట్ కార్డులను ఉపయోగించి డీలర్లు రేషన్ ఇవ్వనున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో స్మార్ట్ కార్డుల పంపిణీ మొదలెట్టారు. ఇకపై ఈ మిషన్ ద్వారా పంపిణీ వేగంగా జరగనుంది. 5జి సౌకర్యం ఉండడంతో సిగ్నల్ సమస్య అనేది తలెత్తే అవకాశం ఉండదు.

- వెంకట సాయినాథ్ రెడ్డి, తహశీల్దార్, సింహాద్రిపురం

వేముల : వేముల రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేపట్టారు. ఇందులో భాగంగా మండల పరిధిలో గ్రామ ప్రజలకు తహశీల్దార్ రెడ్డి లక్ష్మి, టిడిపి నాయకుడు పేర్ల శేషారెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు 8,315 కార్డులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. వీటిని సచివాలయ సిబ్బంది, వీఆర్వో, వీఆర్ఏలు ప్రతి గ్రామంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఆ కుటుంబ సభ్యుల ఒటిపి, వేలిముద్ర, ఐరిస్ ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. పేర్ల శేషారెడ్డి మాట్లాడుతూ ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ఎలాంటి అవకతవకలు జరగవని తెలిపారు. కార్యక్రమంలో డిటి జగదీష్, ఆర్ఐ ప్రసన్న, వీఆర్వోలు, వీఆర్ఏలు, స్థానిక టిడిపి నాయ కులు నాగభూషణ్‌రెడ్డి, వసంతకుమార్ రెడ్డి, పద్మనాభరెడ్డి, ప్రతాప్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, జయ రాములు, ధనంజయ, శివ, వెంకటేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

అధికారులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా పనిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి టి.లక్షుమయ్య

ప్రజాశక్తి - చాపాడు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా పని చేయాలని ఎంపిపి టి.లక్షుమయ్య సూచించారు. మండల సభా భవనంలో శుక్రవారం ఎంపిడిఓ వీర కిషోర్ ఆధ్వర్యంలో పంచాయతీల పురోగతి సూచికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో 9 రకాల స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రతి ఒక్కరూ ఎంచుకోవాలన్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు సమన్వయంతో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు మెరుగ్గా పని చేయాలన్నారు. అభివృద్ధిలో పంచాయతీని వెనుక పడకుండా చూసుకోవాలన్నారు. పేదరికంలేని మెరుగైన గ్రామాలే అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఎంపిడిఓ వీర కిషోర్ మాట్లాడుతూ గ్రామ పంచా యతీలలో పరిశుభ్రత, నీటి సమృద్ధి పట్ల ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు. పనితీరు ఆధారంగా గ్రామ పంచాయతీలకు గ్రేడ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. డం జరుగుతుందన్నారు. అందుకోసం సిబ్బంది ప్రతి ఒక్కరు అభివద్ధికి కషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ హరికృష్ణ, ఏఓ దేవిపద్మలత, పిఆర్ ఏఈ చంద్ర, మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలకృష్ణ ఇష్టానుసారం మాట్లాడడం సబబుకాదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఎమ్మెల్యే బాలకృష్ణ ఇష్టానుసారం మాట్లాడడం సబబుకాదని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ పార్లపల్లె కిషోర్, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నీకు మతిభ్రమించి పిచ్చివాగుడు వాగుతున్నావని బాలకృష్ణనుద్దేశించి పేర్కొన్నారు. నువ్వు పెద్ద సైకోవు కాబట్టే నీ ఇంట్లో కాల్పులు జరిగా యన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పుణ్యాన మెంటల్ సర్టిఫికెట్‌తో కాల్పుల కేసు నుంచి బయటపడ్డావని తెలిపారు. ఆ కృతజ్ఞత కూడా లేకుండా సైకోలా వాగుతున్నావని తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మానవ త్వంతో ఆలోచించే.. నువ్వు అఖండ సినిమా టికెట్ ధరల కోసం మీరు ప్రత్యేకంగా కలుస్తా అని వర్తమానం పంపించినాఆ కూడా చంద్రబాబు సొంత ఇంటి మనిషి ఆయన నాతో కలిస్తే మీ కుటుంబాల మధ్య మన స్పర్ధలు వస్తాయని, మీకు కావాల్సిన పని చేసిన ఘనత జగన్‌ది అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

చిరంజీవిని బాలకృష్ణ అవమానించినా కూడా ఖండించలేని దయ నీయ స్థితిలో పవన్‌కల్యాణ్ పార్టీ కేడర్ ఉందన్నారు. కార్యక్రమంలోబలిజ సంఘం నేత హరికృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వీర కిశోర్

ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

గ్రామ పంచాయతీలో పారిశుధ్యం కోసం ప్రత్యేకంగా నియమించిన క్లాప్ మిత్రలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటారని ఎంపీడీవో వీరకిషోర్ తెలిపారు. స్వచ్ఛత హే సేవ కార్యక్రమంలో బాగంగా స్థానిక పిహెచ్‌సీలో శుక్రవారం సఫాయి మిత్ర సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి పొడితడి చెత్తను సేకరించే సిబ్బంది ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. చెత్త సేకరణ సమయంలో గ్లౌజు, మాస్క్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. గ్రామ పంచాయతీల క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య , కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మెన్ డి.గురివిరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఓ ఎం.హరినాథ్, వైద్యాధికారులు శివప్రసాద్‌రెడ్డి, కావ్య మాధురి, ఏఓ దేవీ పద్మలత, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మహమ్మద్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న తులసిరెడ్డి

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - వేంపల్లె

అన్నదానం మహదానమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాజీవ్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధుల శరణాలయం, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ వృద్ధ శరణాలయాల్లో సంఘ సేవకుడు తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి మనవడు తోపిరెడ్డి షణ్ముఖ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాత తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, లక్ష్మీదేవి, కల్లూరు దేవి ప్రియాంక, లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, షణ్ముఖ రెడ్డి, నిరీషారెడ్డి, సుజాత, తోపిరెడ్డి సరళమ్మ, ప్రొద్దుటూరు ప్రతాపరెడ్డి, ఆల్ఫోన్స్ రెడ్డి, దేరంగుల వెంకటసుబ్బయ్య, కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, వెంకటేష్, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు పాల్గొన్నారు.

జనరేషన్ రోబోటిక్స్‌పై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మెకానికల్ విభాగం సంబంధించి మూడురోజుల విద్యార్థుల జాతీయ సదస్సు యంత్ర 2కె 25ను ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రభాస్ రంజాన్ (యురేనియం కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ తు మ్మలపల్లి), వసంత్‌కుమార్ (న్యూటెక్ బయోసైన్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ పులివెందుల), వి.అజయ్ తేజ (అసిస్టెంట్ సెక్రటరీ గ్రేడ్‌వన్ విశాఖపట్టణం పోర్ట్ అథారిటీ) హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపల్ ఎం శేషమహేశ్వరమ్మ, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి దాదాపు 500 విద్యార్థులు హాజరయ్యారు. నెక్స్ జనరేషన్ రోబోటిక్స్, ఏఐ, నోడ్ ఎంసీయూ, ఆటో డిస్కో ఫ్యూషన్ 360 3డి ప్రింటింగ్‌పై విద్యార్థులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్



అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారులు

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - తొండూరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అధికారులు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. తొండూరు వైద్యాధికారి డాక్టర్ ఆరిపుల్లా ఆధ్వర్యంలో విజయవంతం చేశారు. డిఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖజా మొద్దీన్ దోమకాటు, పలు వ్యాధుల నుంచి రక్షణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఖజా మొద్దీన్, డాక్టర్ రెష్మా, డాక్టర్ సౌజన్య, డాక్టర్ అనన్య, డాక్టర్ జాసిత, సిబ్బంది, ఆరోగ్యవేత్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్షణ గోడల్లేక పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని రావులపల్లె, కుమ్మరావులపల్లె మీదుగా పుష్పగిరి పుణ్యక్షేత్రానికి వెళ్లే మార్గంలో నిర్మించిన వంతెనకు ఇరువైపులా రక్షణ కూడా లేకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ మార్గంలో ప్రతినిత్యం ఎక్కువమంది రాకపోకలు సాగిస్తుంటారు. పుణ్యక్షేత్రం కావడంతో వాహనాలలో ఎక్కువ మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనదారులు రాకపోకల సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా లోతైన కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అండగా ఉంటా.. సంయమనం పాటించాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక తన నివాసంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వారి సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఖాజీపేటకు చెందిన వైసిపి నాయకులు పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జగన్ కు పుష్పగుచ్ఛమిచ్చి పలు సమస్యలను వివరించారు. వైసిపి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి బత్తిన సుబ్బరాయుడు యాదవ్, ఆర్ట్స్ కళాశాల మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి కలిశారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో మరింత కష్టపడి పని చేయాలని జగన్ తమకు సూచించినట్లు వారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు సాగిం చాలని సూచించారన్నారు.



జగన్‌ను కలిసిన బత్తిన సుబ్బరాయుడు యాదవ్

ఫైర్ సిబ్బందికి సూచనలిస్తున్న సిఐ విశ్వనాథరెడ్డి (ఇన్‌సెట్) కమ్ముకున్న దట్టమైన పొగ

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ముదునూరు రోడ్డులో ఉన్న హెచ్‌పి పెట్రోల్ బంక్‌లోకి వర్షపునీరు చేరింది. శుక్రవారం ఆ నీటిని బయట సైడ్ కాలువలోకి పెట్రోల్ బంక్ వారు మోటరుతో తోడారు. ఈ క్రమంలో నీటితోపాటు పెట్రోల్ కూడా కాలువ వెంబడి ప్రవహించింది. విషయం తెలియని ఎవరో కాలువలో సిగరెట్ వేయడంతో మంట రగులుకుంది. పెట్రోల్ బంకు వద్ద పెద్ద ఎత్తున మంటలు రేగి, కాలువ పొడవునా పోలీస్‌స్టేషన్ సమీపం వరకు మంటలు కాలువలో రగులుకున్నాయి. అక్కడ కాలువపై వేసిన మందమైన సిమెంటు దిమ్మెలు కూడా మంటల ధాటికి ఎగిరిపడ్డాయి. అదృష్టవశాత్తు కాలువపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం ఫైర్ పోలీసులకు తెలియడంతో సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పేందుకు కృషి చేశారు. స్థానిక పోలీసులకు విషయం తెలియడంతో సీఐ విశ్వనాథరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పెద్ద ఎత్తున గుమికూడిన ప్రజలను అదుపు చేశారు. ఈ సంఘటన పట్టణంలో పెద్ద చర్చనీయాంశమైంది.

మన్మోహన్ సింగ్ ఆర్థిక మాంత్రికుడు

ప్రజాశక్తి - వేంపల్లె

భారతదేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించిన ఆర్థిక మాంత్రికుడు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వేముల మండల శాఖ అధ్యక్షులు వెంకటేష్, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు పాల్గొన్నారు.

కార్డులను ప్రజలకు పంపిణీ చేస్తున్న రఘునాథ్‌రెడ్డి

పారదర్శకంగా అన్నపూర్ణ పథకం అమలు

ప్రజాశక్తి - వేంపల్లె

పేద ప్రజల కోసం టిడిపి కూటమి ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ జరుగుతున్నదని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో పిరమిడ్ నగర్‌లో దసరా ఉత్సవాల్లో భాగంగా చౌడేశ్వరి ఆలయంలో రఘునాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక పాతపేటలోని 4వ రేషన్ షాపు వద్ద స్మార్ట్ కార్డులను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జగన్నాథ్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, వీరభద్ర, జిల్లా గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు బాలస్వామి రెడ్డి, రాష్ట్ర మైనార్టీ మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మండల మైనార్టీ అధ్యక్షుడు తెలంగాణ వలి, మహమ్మద్ ఇనాయతుల్లా, నామ వేమకుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణ పరిధిలోని ఎల్ఐసి కార్యాలయం ఎదురుగా ముస్లిం కమ్యూనిటీ హాల్ వీధిలో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వీధిలో మంచినీటి పైప్‌లైన్ లేకపోవడంతో నీటి కొరత ఏర్పడింది. పక్క వీధిలో నుంచి కనెక్షన్ ఇవ్వడం వల్ల ఈ వీధి వాసులకు సమయానికి నీరు రావడం లేదు. అర్ధరాత్రి దాటిన తర్వాత 10, 20 నిమిషాలు మాత్రమే నీళ్లు వస్తున్నాయి. అవసర మైన మేరకు నీరు రావడం లేదు. మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సభ్యులు శుక్రవారం సమస్యను గుర్తించి వీధివాసులతో మాట్లాడారు. ఈ వీధిలో కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాయలసీమ ఇన్‌ఛార్జి ఖాన్, పట్టణ అధ్యక్షులు హుస్సేన్‌బాషా, కార్యదర్శి మహమ్మద్ రఫీ, సభ్యులు అల్లా వికాస్, ముక్తియార్, ఫర్హాన్ పాల్గొన్నారు.

వీధి వాసులతో మాట్లాడుతున్న ఎంపిజె సభ్యులు